# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 126 | విశాఖపట్నం | 6-2-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 126 | VISAKHAPATNAM | 6-2-2026 FRIDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


# అవినీతి, అహంకారం దోపిడీ అధికారి
# అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్‌పై వార్తకు
# హర్షం వ్యక్తం చేసిన ఫార్మాసిస్టులు, మెడికల్ షాప్ యాజమానులు

విశాఖపట్నం, పతాకం న్యూస్: అవినీతి, అహంకారం, దుర్మార్గం దోపిడి అని ఒక అవినీతి అధికారిపై పతాకం న్యూస్ లో రాసిన వార్తకు స్పందిస్తూ వందలాది మంది ఫార్మసిస్టులు, మెడికల్ షాప్ యజమానులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.. పతాకం న్యూస్ లో అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ పై రాసిన వార్తకి ఓ మెడికల్ షాపు యజమాని ఫోన్ చేసి చాలా మంచి జరిగిందని అట్లాంటి అవినీతి అధికారులు ఉండకూడదని ఎంతో మందిని ఇబ్బందులు గురిచేసిన విజయ్ కుమార్ కి తగిన శాస్తి జరిగిందని పతాకం న్యూస్ కి ధన్యవాదాలు తెలియజేశారు విశాఖపట్నం జిల్లాలో అయితే ఒక అవినీతి అధికారి ఔషధ నియంత్రణ శాఖ నుండి వెళ్ళిపోవటం సంవత్సరం కాలం నుండి పట్టిపీడిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ విశాఖపట్నం నుండి ఎప్పుడు వెళ్ళిపోతారా అని ఎదురుచూసిన రోజులు లేకపోలేదు, కానీ ప్రాణం లెగిసినట్టు ఉన్నదని మళ్లీ పాత రోజులు వస్తున్నాయని ఫార్మసిస్టులు మెడికల్ షాప్ యజమానులు విశాఖ జిల్లాలో చర్చించుకోవడం సంచలనం రేపుతుంది. ఏం జరిగినా అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ అవినీతి అధికారి వెళ్లిపోవటం మా విశాఖపట్నం పుణ్యం చేసుకున్నదని ఫార్మసిస్టు లు అర్ష వ్యక్తం చేసారు. 2011వ సంవత్సరంలో విజయవాడలో పనిచేసినప్పుడు ఏసీబీ వలలో చిక్కి లంచం కేసులో జైలుకు వెళ్లిన అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ కటకటాల వెనక్కి వెళ్ళిన తీరు మారలేదని అలాంటీ అధికారి ప్రశాంత వాతావరణ మైన విశాఖ జిల్లాలో అవినీతి అధికారి వెళ్లిపోవడం చాలా సుభదాయకమని ఆనాడు ఏసీబీకి పట్టించిన ఓ మెడికల్ షాప్ యజమాని ఫోన్ చేసి పతాకం న్యూస్ కి, ఎడిటర్ శ్రీనివాస్ కి ధన్యవాదములు తెలియచేశారు.






2లో

## తిరుమల లడ్డూపై దుష్ప్రచారం

ఢిల్లీలో వైసీపీ ఎంపీల మీడియా సమావేశం



6లో

## కిడ్నీల ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండాలంటే..



5లో

## గిరిజన ప్రాంతంలో పర్యాటకానికి కొత్త హంగులు



### తిరుమల పవిత్రత దెబ్బతీసేలా వ్యవహరించారు..
# ఉపేక్షించేది లేదు: చంద్రబాబు

అమరావతి, పతాకం న్యూస్: కరుడుగట్టిన నేరస్థుడు అసత్యాన్ని నమ్మించేందుకు చేసే ప్రయత్నమే కల్తీ లడ్డూ విషయంలో జగన్ చేస్తున్నాడని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. జరిగిన అపవిత్రాన్ని సరిచేసేందుకు దేవుడు కల్పించిన మహా సంకల్పంగా తిరుమల లడ్డూ వ్యవహారాన్ని తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ వ్యవహారాన్ని కూటమి నేతలంతా సమావేశమై ఏం చర్యలు తీసుకోవాలి, ఎలా ముందుకు వెళ్లాలని చర్చించారు. అనంతరం కూటమి నేతలు మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు దేవుడంటే కూడా లెక్కచేయలేదని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘోరమైన నేరం చేసి మాహా పాపానికి ఒడికట్టి ఎదురుదాడి చేస్తున్నారన్న సీఎం, విషయాన్ని ఇంతటితో వదలమని స్పష్టం చేశారు.


# మందులపై ఎందుకింత నిర్లక్ష్యం

- డాక్టర్ వర్సెస్ ఫార్మసిస్ట్ ఇద్దురు దొందులే
- మందుల్ని చులకనగా చూస్తున్న అధికారులు
- గాజువాక పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్ ఎంత చెప్పితే అంతే
- ఆసుపత్రి లోపలకు మందులు పెట్టవద్దని హుకుం జారీ చేసిన ఫార్మసిస్ట్
- తానా అంటే తందానా అని ఫార్మసిస్ట్‌కు వంతు పాడుతున్న డాక్టర్




గాజువాక, పతాకం న్యూస్: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ( పిహెచ్‌సీ)లో క్షయ వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేయవలసిన మందులను లోపల పెట్టరాదని ఆసుపత్రులో విధులు నిర్వహిస్తున్న ఫార్మసిస్ట్ హుకుం జారీ చేయడం గమనార్హం. ఫార్మసిస్ట్ ఏది చెబితే అదే అంటూ డాక్టర్ చెప్పడం మరొక విశేషం.లక్షలాది రూపాయలకు విలువ చేసే క్షయ వ్యాధిగ్రస్తుల మందులు, పరికరాలు గత రెండు రోజులుగా బయట ఉన్నప్పటికీ లోపలకు పెట్టేందుకు ఎటువంటి అనుమతులు ఫార్మసిస్ట్ ఇవ్వకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మరియు ఫార్మసిస్ట్ ఏది చెబితే అదే అంటూ చెప్పడం అక్కడికి వస్తున్న రోగులు, ప్రజలు ఫార్మసిస్ట్, మరియు డాక్టర్ తీరును తప్పుపడుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే మందుల్లో ఇంత నిర్లక్ష్యమా అంటూ ఎద్దేవా చేస్తున్నారు. గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్ తీరుపై పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఫార్మసిస్టు ఏమి చెప్పితే అదే అంటున్న డాక్టర్ తీరు పై పలువురు రోగులు తీవ్ర ఆవేదానికి గురవుతున్నారు. గత రెండు రోజులుగా లక్షలది రూపాయలు విలువ చేసే మందులు పరికరాలు ఆసుపత్రి బయట ఉన్నప్పటికీ కనీసం లోపల పెట్టే ఇంగిత జ్ఞానం లేదా అంటూ ఆసుపత్రికి విచ్చేస్తున్న పలువురు రోగులు ,ప్రజలు, ఆసుపత్రికి సిబ్బంది తీరుపై రోగులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై జిల్లా ఆరోగ్య అధికారులు, జిల్లా కలెక్టర్, గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పై దృష్టి సారిస్తే బాగుంటది అని ప్రజలు కోరుతున్నారు,

ఆసుపత్రిలో జరుగుతున్న విషయాలు మరిన్ని వెలుగులోకి వస్తాయని పలువురు ప్రజలు, ప్రజా సంఘాలు నాయకులు కోరుతున్నారు. ఈ విషయంపై మరింత లోతుగా దర్యాప్తు చేసి ఫార్మసిస్టు, డాక్టర్లు నిర్లక్ష్యం పై చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు.




పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# విద్యా మాఫియా

ఫీజుల దందాపై గళమిప్పిన ఎస్ఎఫ్ఐ నేతలను కిడ్నాప్ చేయడానికి తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం బరితెగించిన తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. బౌన్సర్లతో విద్యార్థి నేతలను బలవంతంగా ఎత్తుకుపోవడం, వారిపై అమానుషంగా దాడి చేయడం వంటి చర్యలు ఆ విశ్వవిద్యాలయంలో నేరాలు వ్యవస్థీకృతమైన తీరుకు, యాజమాన్య నేర ప్రవృత్తికి నిదర్శనాలు. విద్యాసంస్థల్లో సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేయడం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం కొత్తేమీ కాదు! మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో జరిగింది కూడా ఇదే! కానీ, విద్యాసంస్థ యాజమాన్యం అన్ని పరిధిలను అతిక్రమించి ప్రశ్నించిన వారిని ఎత్తుకెళ్లి, భౌతికదాడులు చేసి, అంతం చేసేలా వ్యవహరించడం ఖచ్చితంగా రాష్ట్రంలో కొత్త పరిణామమే! ఉదారవాద ఆర్థిక విధానాల పుణ్యమా అని కార్పొరేట్ల చేతుల్లో చిక్కుకున్న విద్యావ్యవస్థకు ఇప్పటికే లాభార్జన ప్రధానంగా మారింది. అక్కడి నుండి తమ ఖజానాలు నింపుకోవడానికి, ఎంతటి దారుణమైనా చేసే మాఫియా ముఠాల స్థాయికి కార్పొరేట్ విద్యా వ్యవస్థ దిగజారుతున్న తీరుకు తాజా పరిణామం ఒక నిదర్శనం.

మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఫీజుల దందాపై దుమారం రేగడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ అధిక ఫీజుల వసూలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆరోపణలు వచ్చాయి. రకరకాల పేర్లతో సాగిన ఫీజుల దందా శృతి మించడంతో నియంత్రణ సంస్థల జోక్యం, కోర్టుల దాకా ఈ వివాదాలు వెళ్లాయి. దాదాపు 26 కోట్ల రూపాయలను యాజమాన్యం అక్రమంగా వసూళ్లు చేసినట్లు ఉన్నత విద్యామండలి నిర్ధారించింది. అక్రమ వసూళ్లకు పాల్పడటంతో 15 కోట్ల రూపాయల జరిమానాను ఉన్నత విద్యామండలి విధించింది కూడా! విద్యార్థుల తల్లిదండ్రులు తమ కష్టార్జితాన్ని వెనక్కి తీసుకోవడానికి పోరాటం కొనసాగించారు. మరోసారి ఉన్నత విద్యామండలిని ఆశ్రయించారు. ఇది యాజమాన్యానికి నచ్చలేదు. యూనివర్శిటీ ప్రాంగణానికి వారిని పిలిపించి మోహన్‌బాబు కుమారుడు మంచు విష్ణు బౌన్సర్లతో దాడి చేయించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేసే ఎస్ఎఫ్ఐ సహజంగానే ఈ దౌర్జన్యంపై దృష్టి సారించింది. విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఆందోళన చేపట్టింది, ఇది నచ్చని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం విద్యార్థులను బెదిరించడానికి మాఫియా అవతారమెత్తి కిడ్నాప్‌లకు, దాడులకు దిగడం అమానుషం. వివాదం ప్రారంభమైన వెంటనే యాజమాన్యం సంయమనం పాటించి, విద్యార్థులతోనూ, వారి తల్లిదండ్రులతోనూ చర్చించి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదు. అయితే, యూనివర్శిటీ యాజమాన్యానిది మొదటి నుండి దండోపాయ మార్గమే. విద్యార్థుల నిరసనను అణచివేతతో ఎదుర్కోవాలన్న ధోరణి ఏ విద్యాసంస్థకైనా హానికరమైంది. విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య హక్కు. తాజా వ్యవహారంలో సిపిఎం నేతలు విషయాన్ని తమ దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే పోలీసులు స్పందించిన తీరు ప్రశంసనీయం. తక్షణమే వారు స్పందించకుంటే బౌన్సర్ల నిర్బంధంలో ఉన్న విద్యార్థి నేతల పరిస్థితి మరింత ఘోరంగా మారి ఉండేది. అయితే, ఇక్కడితో చాలదు. ఈ వ్యవహారంలో ఇప్పటికే విశ్వవిద్యాలయ పిఆర్ఓ సతీష్, మోహన్‌బాబు, మంచు విష్ణులపై కేసులు నమోదయ్యాయి. విచారణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, కిడ్నాపర్లు, వారి వెనుక వున్న వారిని కఠినంగా శిక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న మోహన్‌బాబు యూనివర్శిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలి. వారి తల్లిదండ్రుల నుండి అక్రమంగా వసూలు చేసిన కోట్లాది రూపాయల మొత్తాన్ని వెనక్కి ఇప్పించాలి. విద్యా సంస్థలు మాఫియా ముఠాలుగా మారకుండా, సామాజిక బాధ్యతతో పని చేసేలా, ఫీజులు, సదుపాయాలు, భద్రత వంటి అంశాల్లో అత్యంత పారదర్శకంగా వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంతో రాష్ట్రంలో చట్టబద్ధ పాలన సాగుతోందా? అన్న సందేహం ఎవరికైనా కలుగుతుంది. ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టడం అవశ్యం.

## క్యాన్సర్‌తో పోరాడుతూ నటి వాహిని మృతి



**విజయనగరం, పతాకం న్యూస్:** సినీ నటి వాహిని కన్నుమూశారు. కొంతకాలంగా క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న ఆమె... తన స్వస్థలం విజయనగరంలో నిన్న సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని సినీ నటి కరాటే కల్యాణి వెల్లడించారు. వాహిని మృతి పట్ల సహ నటీనటులు, సినీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 48 ఏళ్ల వాహిని విజయనగరంలో జన్మించారు. తెలుగుతో పాటు పలు తమిళ చిత్రాల్లో కూడా ఆమె నటించారు. సహాయ నటిగా మంచి గుర్తింపు పొందారు. సినిమాలతో పాటు బుల్లితెరపై ఆమె సందడి చేశారు. అనేక ప్రేక్షకాదరణ పొందిన సీరియల్స్ లో ఆమె నటించారు. సీరియల్స్ లో ఎంతో క్రేజ్ తెచ్చుకున్నారు.

## రెండేళ్లుగా శ్రీవారి లడ్డూల్లో కల్తీ నెయ్యి.. తెలిసినా వైసీపీ ప్రభుత్వం మౌనంగా ఉంది: పయ్యావుల



**అమరావతి, పతాకం న్యూస్ :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందని, ఈ విషయం తెలిసినా గత వైసీపీ ప్రభుత్వం వాస్తవాలను తొక్కిపెట్టిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సంచలన ఆరోపణలు చేశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంలో గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన విమర్శించారు. ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో సమావేశం ముగిసిన అనంతరం కూటమి నేతలు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పయ్యావుల మాట్లాడుతూ, ప్రజలకు నిజాలు తెలియాలనే ఉద్దేశంతోనే ఈ విషయాలను బయటపెడుతున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యత తగ్గిందని, నెయ్యి మంచి వాసన రావడం లేదని భక్తుల నుంచి విస్తృతంగా ఫిర్యాదులు వచ్చాయని పయ్యావుల గుర్తుచేశారు. పోటు కార్మికులు సైతం నెయ్యి నూనెలా జారిపోతోందని చెప్పినా, అప్పటి పాలకులు దాన్ని ఆర్గానిక్ నెయ్యి అంటూ తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమల ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు.. అనుమానంతో నాలుగు ట్యాంకర్ల నెయ్యి శాంపిళ్లను గుజరాత్‌లోని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపారని వివరించారు.

ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదికలో అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని పయ్యావుల తెలిపారు. ఆ నెయ్యిలో సోయాబీన్, సన్‌ఫ్లవర్, చేపల నూనె, కొబ్బరి నూనె, పామాయిల్, వెజిటెబుల్ ఆయిల్ వంటివి కలిపినట్లు నివేదిక స్పష్టం చేసిందని అన్నారు. అంతటితో ఆగకుండా అందులో జంతు కొవ్వు కూడా కలిసినట్లు తేలిందని, ఇది అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. "భోలేబాబా డెయిరీలో తయారైన ఈ పదార్థానికి నెయ్యి అని పేరుపెట్టారు. దానికి నెయ్యి వాసన, రూపం వచ్చేందుకు రకరకాల రసాయనాలు కలిపారు. 2022లో మొదలైన ఈ నేరం 2024 వరకు నిరాటంకంగా కొనసాగింది. ఇదంతా తెలిసినా గత ప్రభుత్వం ఈ నివేదికను తొక్కిపెట్టింది" అని పయ్యావుల ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు.

## హన్మకొండలో మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం



**హన్మకొండ, పతాకం న్యూస్ :** ఆసియా అతిపెద్ద గిరిజన జాతర మేడారం హుండీల లెక్కింపు ప్రారంభమైంది. హుండీల లెక్కింపునకు పది రోజుల సమయం పడుతుందని భావిస్తున్నారు. రెండేళ్లకోసారి వచ్చే ఈ మహా జాతర గత నెల 28 నుంచి 31 వరకు జరిగింది. సమ్మక్క, సారలమ్మలను కోట్లాది మంది భక్తులు దర్శించుకుంటారు. జాతరకు నెల రోజుల ముందు, జాతర అనంతరం మరికొన్నిరోజులు మేడారంను భక్తులు సందర్శిస్తారు. ఈ మహా జాతర హుండీలను హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. ఈరోజు మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి లెక్కింపును ప్రారంభించారు. మేడారం జాతరకు తరలి వచ్చిన భక్తులు అమ్మవార్లకు కానుకలు సమర్పించుకున్నారు. క్రితంసారి మేడారం జాతరకు రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది.

## కమ్మేసిన పొగమంచు



**పాడేరు, పతాకం న్యూస్ :** మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నప్పటికీ చలి తీవ్రత మాత్రం తగ్గలేదు. శీతల గాలులు, దట్టంగా పొగమంచు కొనసాగుతున్నాయి. ఏజెన్సీలో ఉదయం 10 గంటల వరకు పొగమంచు దట్టంగా కమ్మేసింది. పాడేరు మొదలుకుని దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ అదే వాతావరణం నెలకొంది. దీంతో వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. చలి తగ్గకపోవడంతో ఏజెన్సీ వాసులు వణుకుతున్నారు.

## ఆంధ్ర యూనివర్సిటీకి బాంబు బెదిరింపు.. పోలీసుల హై అలర్ట్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్ర యూనివర్సిటీలో బాంబు పెట్టినట్లు వచ్చిన ఒక ఈమెయిల్ వర్సిటీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి యూనివర్సిటీ అధికారిక మెయిల్ ఐడీకి ఈ బెదిరింపు సందేశం రావడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే త్రీటౌన్ పోలీసులు, బాంబు స్క్వాడ్ డాగ్ స్క్వాడ్‌తో రంగంలోకి దిగారు. ప్రధానంగా ఉమెన్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ కార్యాలయంతోపాటు పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. యూనివర్సిటీ ప్రాంగణమంతా ప్రస్తుతం పోలీసుల ఆధీనంలో ఉంది. అణువణువూ తనిఖీ చేస్తున్నట్లు సీఐ పైడయ్య తెలిపారు. ఈ మెయిల్ ఎక్కడి నుండి వచ్చింది ? దీని వెనుక ఉన్నది ఎవరు ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది ఎవరూ ఆందోళన చెందవద్దని, భద్రతా చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.


## తిరుమల లడ్డూపై దుష్ప్రచారం

### ఢిల్లీలో వైసీపీ ఎంపీల మీడియా సమావేశం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలను వైసీపీ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, సీబీఐ నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని వారు తెలిపారు. ఉండవల్లిలో కూటమి నేతలు చేసిన విమర్శలకు కౌంటర్‌గా గురువారం ఢిల్లీలో వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి మీడియా సమావేశం నిర్వహించారు. రాజకీయ ప్రయోజనాల కోసం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారంటూ వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, అందులో నిజం లేదని తేల్చిందని వైసీపీ నేతలు గుర్తుచేశారు. ఆ తర్వాత సీబీఐ కూడా అదే నిర్ధారణకు వచ్చిందని పేర్కొన్నారు. అయినా, కూటమి ప్రభుత్వం కావాలనే విషప్రచారం చేస్తూ, ఫ్లెక్సీలు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వారు ఆరోపించారు. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తనపై చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని, ఎలాంటి పరీక్షకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. "నేను టీటీడీ ఛైర్మన్‌గా ఎలాంటి అవినీతికి పాల్పడలేదు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే పనులు చేయలేదు. స్వామివారి సాక్షిగా ఏ ప్రమాణం చేయడానికైనా నేను రెడీ. అవసరమైతే దేవుడి ముందు సత్యశోధన (పాలిగ్రాఫ్) పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నాను" అని ఆయన స్పష్టం చేశారు. నెయ్యి సరఫరాను పెంచేందుకే నిబంధనలు సవరించామని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని వివరించారు. వివాదాస్పదమైన 'బోలె బాబా' కంపెనీ సరఫరా నిబంధనల సవరణకు ముందే జరిగిందని, అది కూడా టీడీపీ హయాంలోనే మొదలైందని గుర్తుచేశారు. తనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న చిన్న అప్పన్న తన పీఏ కాదని, కేవలం ఏపీ భవన్‌లో లైజన్ ఆఫీసర్ మాత్రమేనని ఆయన తేల్చిచెప్పారు. వైసీపీ లోక్‌సభా పక్ష నేత మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం పవిత్రమైన వెంకటేశ్వర స్వామిని కూడా వాడుకుంటున్నారని, ఇది ఘోరమైన తప్పని విమర్శించారు. "సిట్ నివేదిక చంద్రబాబు ఆరోపణలు అబద్ధమని తేల్చింది. దాన్ని జీర్ణించుకోలేక ఇప్పుడు మళ్లీ కొత్త కమిటీలు వేసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. వైవీ సుబ్బారెడ్డి గారు వెంకటేశ్వర స్వామికి పరమ భక్తుడు. అలాంటి వ్యక్తిపై ఇలాంటి నీచమైన ఆరోపణలు చేయడం దుర్మార్గం" అని మిథున్ రెడ్డి అన్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ.. సీబీఐ, సిట్ నివేదికలు టీడీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివని, అందుకే ఆ నివేదికలను పక్కనపెట్టి మళ్లీ కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. "ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. గత జనవరి నుంచి టీటీడీ ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు" అని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఆరోపణలు రాగానే 'బోలె బాబా' కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామని, కానీ ఇప్పుడు కావాలనే పాత విషయాలను తవ్వి తీస్తున్నారని విమర్శించారు. దేవుడితో రాజకీయాలు చేసేవారికి తగిన శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. దర్యాప్తు సంస్థల నివేదికలను గౌరవించి, అసత్య ప్రచారాలను వెంటనే ఆపాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు.

## విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికో మృతి




**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో విధినిర్వహణలో ఉన్న ఓ మెడికో అనుమానాస్పద రీతిలో మరణించింది. విధుల్లో ఉండగానే కడుపునొప్పితో బాధపడుతున్నట్లు చెప్పడంతో మరో వైద్య విద్యార్థిని ఇంజెక్షన్ చేసింది. ఆ తర్వాత ఆపరేషన్ గదిలో విద్యార్థిని మరణించినట్లు గుర్తించిన సహచరులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లాకు చెందిన దీపిక ఎంబీబీఎస్ పూర్తిచేసి అనస్తీషియా విభాగంలో పీజీ చేస్తోంది. విజయవాడ వైద్య కళాశాలలో చదువుతున్న దీపిక.. విధుల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఆసుపత్రికి వచ్చింది. సాయంత్రం 4 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు ఆమె డ్యూటీ చేయాల్సి ఉంది. అయితే, బుధవారం సాయంత్రం డ్యూటీకి వచ్చిన కాసేపటికే కడుపునొప్పిగా ఉందని తోటి వైద్య విద్యార్థులకు చెప్పింది. దీంతో ఓ విద్యార్థిని ఆమెకు ఇంజెక్షన్ చేసింది. ఆ తర్వాత విధుల్లో నిమగ్నమైన దీపిక రాత్రి 11.30 గంటల సమయంలో ఆపరేషన్ గదిలో బల్లపై పడిపోయింది. వెంటనే ఆమెను పరీక్షించిన సహచరులు.. దీపిక అప్పటికే మరణించిందని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో కలిసి సీసీ కెమెరాలను పరిశీలించారు. దీపిక ఆత్మహత్యకు పాల్పడిందా లేక మరేదైనా కారణమా అనేది తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

# సీలేరు కాంప్లెక్సులో ఆరు మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి



**సీలేరు, పతాకం న్యూస్:** సీలేరు కాంప్లెక్సు పరిధిలోని మూడు జల విద్యుత్ కేంద్రాల ద్వారా రోజుకు సుమారు ఆరు మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నామని సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు ఎనిమిది వేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు, సీలేరు, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాల ద్వారా గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు విద్యుదుత్పత్తి చేస్తున్నామన్నారు. సీలేరు కాంప్లెక్సులో ప్రస్తుతం జరుగుతున్న విద్యుదుత్పత్తి కంటే పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నామని, దీనికి గ్రిడ్ అధికారుల నుంచి ఆదేశాలు రావలసి ఉందని ఆయన చెప్పారు. సీలేరు కాంప్లెక్సులో ప్రస్తుతం డొంకరాయిలో మినహా పొల్లూరు, సీలేరు, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాల్లో యూనిట్లు అన్నీ అందుబాటులోనే ఉన్నాయన్నారు. డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో యూనిట్ ఓవర్‌హాలింగ్ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందేనన్నారు. సీలేరులో రోజుకు 1.5 మిలియన్ యూనిట్లు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో 3.5 మిలియన్ యూనిట్లు, మాచ్‌ఖండ్‌లో ఒక మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేస్తున్నామని చెప్పారు. గోదావరి డెల్టాకు ఈ నెలాఖరు వరకు నీటి విడుదలను కొనసాగిస్తామని, గోదావరి డెల్టాకు నీటి విడుదల నేపథ్యంలో బలిమెల జలాశయం నుంచి మన వాటాగా 5 వేల క్యూసెక్కుల వరకు నీటిని తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

# గంటల వ్యవధిలోనే దొంగతనం కేసును ఛేధించిన పోలీసులు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ నాలుగో పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ దొంగతనం కేసును కేవలం గంటల వ్యవధిలోనే ఛేదించి, నిందితులను అరెస్ట్ చేయడమే కాకుండా పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను రికవరీ చేశామని డిసిపి (క్రమ్స్) కె. లతా మాధురి మీడియాకు వివరించారు. చోరీ జరిగిన లాకెట్‌తో కూడిన 2 బంగారు నెక్లెస్లు 6 బంగారు గాజులు మొత్తం బరువు: 280 గ్రాముల బంగారం, విలువ: సుమారు 6,00,000 (ఆరు లక్షల స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

# ఆర్ఐఎన్ఎల్‌కు ఖర్చు తగ్గింపే ప్రధాన లక్ష్యం



**గాజువాక, పతాకం న్యూస్:** రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)ను లాభదాయక మార్గంలో నిలబెట్టేందుకు ఖర్చు తగ్గింపు, ఆపరేషనల్ సామర్థ్య పెంపు, క్రమశిక్షణా చర్యలపై దృష్టి సారించనున్నట్లు కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పాండ్రిక్ తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని ఎల్ అండ్ డిసి భవనంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, పలువురు కార్మికులతో ఆయన, విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎండి మనీష్ రాజ్ గుప్తా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సందీప్ పాండ్రిక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆర్ఐఎన్ఎల్‌కు నాణ్యత పరంగా మంచి బ్రాండ్ విలువ ఉందని, ఇతర కంపెనీలకు మళ్లిన కస్టమర్లను తిరిగి తీసుకురావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఆర్థిక, ఉక్కు మంత్రిత్వ శాఖల్లో ఆర్ఐఎన్ఎల్‌పై దృక్పథం మారిందని తెలిపారు. అత్యల్ప అంచనాలతో ప్రారంభించినప్పటికీ సంస్థ లక్ష్యాలను సాధించి మంచి ఫలితాలు ఇచ్చిందని ప్రశంసించారు. ఇదే ఉత్సాహాన్ని మరో ఏడాది కొనసాగించాలని, ముఖ్యంగా ఖర్చు తగ్గింపు, సామర్థ్య పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. సంస్థ రుణాలపై వడ్డీ రేటు 14 శాతం నుంచి 8.9 శాతానికి తగ్గిందని, ఇంకా తగ్గించే అవకాశముందని తెలిపారు. ప్రస్తుతం టన్నుకు రూ.48 వేలు ఉన్న ఉత్పత్తి వ్యయాన్ని రూ.40 వేల నుంచి 42 వేలకు తగ్గించడమే లక్ష్యమని వెల్లడించారు. 18 నెలల క్రితం మూసివేత చర్చల నుంచి ఇప్పుడు కొత్త మూలధన వ్యయాల దిశగా అడుగులు వేస్తున్నామని, కొత్త కోక్ ఓవెన్ బ్యాటరీ నిర్మాణానికి డిపిఆర్ సిద్ధం చేయాలని సూచించారు. భవిష్యత్తులో మానవ వనరుల లోటు రాకుండా ఉండేందుకు కొత్త ఎగ్జిక్యూటివ్ నియామకాలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. పనితీరు ఆధారంగానే వేతన సవరణలు, ప్రమోషన్లు ఉంటాయని స్పష్టం చేశారు. ఉత్పత్తి స్థాయిలను కొనసాగిస్తే ఏప్రిల్ 2026 నాటికి ప్రమోషన్లు ఇస్తామన్నారు. ఫైనాన్స్ విభాగానికి బిల్లులు ఆమోదించడం మాత్రమే కాకుండా మరిన్ని వ్యూహాత్మక బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిపారు. 'ఇది మీ ప్లాంట్... మీ పనితీరే దీనిని నిలబెడుతుంది' అంటూ ఉద్యోగులకు కార్యదర్శి సూచించారు. మనీష్ రాజ్ గుప్తా మాట్లాడుతూ సంస్థలో ఉన్న వ్యక్తిగత, ఆర్థిక సమస్యలను రెండు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆర్ఐఎన్ఎల్ పనితీరు ప్రైవేట్ స్టీల్ ప్లాంట్లకు సరితూగుతోందని, కొన్ని అంశాల్లో ఇతర ప్లాంట్లకంటే మెరుగ్గానే ఉందని పేర్కొన్నారు. టన్నుకు రూ.7,000 వరకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే అవకాశాలు గుర్తించామని, వాటిపైనే ప్రధాన దృష్టి ఉంటుందని తెలిపారు.

# మురికికాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మురికి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించిన ఘటన గురువారం విశాఖలో జరిగింది. మారుతీ సర్కిల్ నుండి ములగాడ వేళ్ల రహదారి విశాఖపట్నం పోర్ట్ లాజిస్టిక్స్ లిమిటెడ్ ఎదురుగా ఉన్న మురికి కాలువ లో గుర్తు తెలియని 50 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి మఅతదేహం కలకలం రేపింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. గాజువాక పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఐఎఫ్ఆర్‌కు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష (ఐఎఫ్ఆర్-2026), మిలాన్, అంతర్జాతీయ సిటీ పరేడ్ కార్యక్రమాల నిర్వహణకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ సూచించారు. నేవీ, పోలీస్, ఇతర విభాగాల అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కోస్ట్‌గార్డు డీఐజీ రాజేష్ మిత్తల్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీసీపీలు, ఆర్డీవోలు ఇతర అధికారులు సమీక్షలో భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రపతి, రక్షణ మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులతో పాటు రెండు లక్షలకు పైగా ప్రజలు హాజరుకానున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మౌలిక సదుపాయాల కల్పన, వైద్య సేవల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 17న రాష్ట్రపతి రాకతో కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. 18న ఫ్లీట్ రివ్యూ, 19వ తేదీ ఉదయం మిలాన్ ప్రారంభోత్సవం, సాయంత్రం ఆర్కే బీచ్‌లో అంతర్జాతీయ సిటీ పరేడ్ ఉంటాయన్నారు. సిటీ పరేడ్ మార్గంలో ఎల్ఈడీ స్క్రీన్లు, పీఏ సిస్టమ్, గ్యాలరీలు, బారికేడ్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రాంతాలపై ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వీఎంఆర్డీఏ పార్కు, వైఎంసీఏ, ఏయూ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లను హోల్డింగ్ ఏరియాలుగా వినియోగించుకోవాలన్నారు. బీచ్ రోడ్డు సుందరీకరణ, డెకరేటివ్ లైటింగ్, పరిశుభ్రత పనులను వేగవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి 17 నుంచి కంట్రోల్‌రూమ్ పూర్తిస్థాయిలో పనిచేస్తుందని, అవసరమైతే వేదికల వద్ద కూడా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు, నైట్ విజన్ పరికరాలు ఏర్పాటుచేసి కంట్రోల్ రూమ్ ద్వారా లైవ్ మానటరింగ్‌కు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ అన్నారు. నో-డ్రోన్, నో కైట్ జోన్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. పార్కింగ్ ప్రాంతాల్లో, ప్రముఖులు రాకపోకలు సాగించే ప్రధాన రహదారుల్లో లైటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. సమావేశంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ ఉద్యోగి ఆస్తులపై ఏసీబీ రైడ్స్.. ఇరు తెలుగు రాష్ట్రాల్లో సోదాలు..




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో విశాఖలో పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి కె.శ్రీనివాసరావు నివాసాల్లో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు గురువారం విస్తృత సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ సోదాలు విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతాలతో పాటూ హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి ప్రాంతంలో ఒకేసారి కొనసాగుతున్నాయి. ముందస్తు సమాచారం ఆధారంగా ఏసీబీ అధికారులు ఈరోజు ఉదయం నుంచి ఒకేసారి పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం, మధురవాడ, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా సహా హైదరాబాద్ శివారులోని శేరిలింగంపల్లి ప్రాంతాల్లో శ్రీనివాసరావుకు చెందిన ఇళ్లు, బంధువుల నివాసాలు, అనుబంధ ఆస్తులపై సోదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. పంచాయతీరాజ్ శాఖలో పనిచేసిన సమయంలో శ్రీనివాసరావు ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టినట్టు ఏసీబీకి ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయనపై కేసు నమోదు చేసి సోదాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రాథమికంగా స్థిరాస్తులు, బ్యాంక్ డిపాజిట్లు, బంగారం, నగదు, విలువైన పత్రాలు వంటి అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. శ్రీనివాసరావుకు హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి ప్రాంతంలోనూ నివాస భవనం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు సోదాలు నిర్వహించిన అధికారులు.. బ్యాంక్ లావాదేవీలు, పెట్టుబడుల వివరాలను సేకరిస్తున్నారు. సోదాలు పూర్తైన తర్వాత.. ఆయన ఆస్తి వివరాలపై అధికారిక ప్రకటన విడుదల చేయడం సహా తదుపరి చర్యలు చేపట్టే అవకాశముంది. ఏసీబీ సోదాలతో విశాఖ, మధురవాడ ప్రాంతాల్లో స్థానికంగా ఉత్కంఠ నెలకొంది. పంచాయతీరాజ్ శాఖకు చెందిన విశ్రాంత ఉద్యోగిపై ఇంత పెద్ద స్థాయిలో సోదాలు జరగడంపై చర్చనీయాంశంగా మారింది

# జీవీఎంసీ బడ్జెట్ రూ. 4,047.12 కోట్లు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.4,047.12 కోట్ల బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించింది.మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. సమావేశంలో బడ్జెట్ వివరాలను మేయర్ క్లుప్తంగా సభ్యులకు వివరించగా, చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి ముసాయిదాలో పొందుపరిచిన ఆదాయం, ఖర్చుల అంచనాలను సభ్యులకు చదివి వినిపించారు. 2025 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ జీవీఎంసీకి వచ్చిన ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని 2026-27 బడ్జెట్‌ను రూపొందించినట్టు వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను ద్వారా రూ.550 కోట్లు, ఖాళీ స్థలాలపై పన్ను ద్వారా రూ.85 కోట్లు, స్థిరాస్తులపై స్టాంపు డ్యూటీ రూపంలో రూ.200 కోట్లు, మార్కెట్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా రూ.4.8 కోట్లు, ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాల్స్ నుంచి రూ.45 లక్షలు, ఆటస్థలాలు, స్విమ్మింగ్‌పూల్స్ నుంచి రూ.80 లక్షలు, ఇతర అద్దెలు రూ.14.5 కోట్లు, స్పాట్ ఫైన్‌ల ద్వారా రూ.80 లక్షలు, ఆస్తి బదలాయింపుపై చార్జీల ద్వారా రూ.పది కోట్లు, అద్దె భవనాల నుంచి రూ.15 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రూపేణా రూ.30 కోట్లు, ఆస్తి పన్ను చెల్లింపుపై వడ్డీ రూ.70 కోట్లు, పద్దులో లేని ఇతర ఆదాయం రూ.ఐదు కోట్లు, మూలధనపు జమలు రూ.246 కోట్లు మొత్తం...సాధారణ పరిపాలన నుంచి రూ.1232.6 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఇక ఖర్చుల విషయానికి వస్తే సాధారణ ఖర్చులకు రూ.4.2 కోట్లు, పరిపాలనాపరమైన అంశాలకు రూ.34.85 కోట్లు, నిర్వహణాపరమైన ఖర్చులకు రూ.2.05 కోట్లు, రుణాలపై వడ్డీలు చెల్లింపునకు రూ.30 కోట్లు, స్థానిక సంస్థల ఎన్నికలు కోసం రూ.2.5 కోట్లు, వేసవి శిక్షణ శిబిరాలకు రూ.1.5 కోట్లు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు రూ.1.77 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని అంచనా వేశారు. లైబ్రరీ సెస్సు చెల్లింపునకు రూ.40 కోట్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోసం రూ.200 కోట్లు, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై అసలు తీర్చేందుకు రూ.35 కోట్లు, ఇలా మొత్తం సాధారణ పరిపాలన కోసం రూ.365.82 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో రోడ్ల నిర్వహణ కోసం రూ.80 కోట్లు, రోడ్ల అన్యుటీ కోసం రూ.25 కోట్లు, గుంతలు పూడ్చేందుకు రూ.నాలుగు కోట్లు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణానికి రూ.పది కోట్లు, వరదనీటి కాల్వల నిర్మాణానికి రూ.15 కోట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణకు రూ.1.5 కోట్లు, మురుగునీటి కాలువలు కోసం రూ.15 కోట్లు, ట్రాఫిక్ ఐలాండ్స్, సెంట్రల్ మీడియన్‌ల నిర్వహణ కోసం రూ.31 కోట్లు, పార్కుల అభివృద్ధి కోసం రూ.36.13 కోట్లు, బీచ్‌ల నిర్వహణకు రూ.ఐదు కోట్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ.15 కోట్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహణకు రూ.పది కోట్లు, క్వాలిటీ కంట్రోల్ ఖర్చులకు రూ.ఐదు కోట్లు, ఆటస్థలాలు, స్టేడియాల నిర్వహణకు రూ.13 కోట్లు, మార్కెట్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వహణకు రూ.11 కోట్లు, భవనాల నిర్వహణకు రూ.14 కోట్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్వహణకు రూ.50 కోట్లు, రోడ్ల విస్తరణకు రూ.52 కోట్లు, వరదనీటి కాలువకు రూ.82 కోట్లు, సిమెంట్ రోడ్లకు రూ.92 కోట్లు, బీటీ రోడ్లకు రూ.83 కోట్లు, మురుగునీటి కాలువల నిర్వహణకు రూ.58 కోట్లు, శ్మశాన వాటికలకు రూ.20 కోట్లు, కల్వర్టులకు రూ.18 కోట్లు, అన్నిరకాల గ్రాంట్లు కలిపి ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.1028.18 కోట్లు ఖర్చు చేయాలని అంచనా వేశారు. విద్యుత్ విభాగం ద్వారా వీధిదీపాలు, విద్యుత్‌స్తంభాలు, కేబుల్స్ ఏర్పాటుకు రూ.129.19 కోట్లు, వివిధ రకాల ప్రాజెక్టుల కోసం రూ.117.35 కోట్లు, టౌన్‌ప్లానింగ్ విభాగానికి రూ.23.93 కోట్లు, యూసీడీ విభాగం ద్వారా రూ.16.43 కోట్లు, విద్య కోసం రూ.2.25 కోట్లు, ప్రజారోగ్యం విభాగం ద్వారా రూ.455.94 కోట్లు, నీటి సరఫరా విభాగం ద్వారా రూ.260.08 కోట్లు, అమృత్ పథకం కోసం రూ.363 కోట్లు, ఇతర నిధులతో చేపట్టే ప్రాజెక్టులకు రూ.58 కోట్లు, ఆర్థిక సంఘం ద్వారా వచ్చే నిధుల నుంచి రూ.200 కోట్లు, అర్బన్ ఛాలెంజింగ్ ఫండ్ రూ.650 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరించిన బడ్జెట్‌ను రూ.3,704.23 కోట్లతో కౌన్సిల్ ఆమోదించింది.

# సహాయక చర్యలపై అవగాహన అవసరం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరికి ప్రాథమిక సహాయక చర్యలపై అవగాహన అవసరమని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎంఆర్‌నగర్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అగ్నిమాపక, విపత్తు నిర్వహణ, రెడ్‌క్రాస్ సంస్థ సంయుక్తం ఆధ్వర్యంలో నిర్వహించిన రెస్క్యూ, ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్స్ ప్రదర్శనను ఆయన ముఖ్యఅతిథి హాజరై ప్రారంభించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా రక్షించాలని అనే అంశాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి పి.సింహాచలం, కళాశాల ప్రినిపాల్ ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

# రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. పంటల్లో చీడపీడల నివారణకు డ్రోన్ వినియోగం ద్వారా తక్కువ, డబ్బు ఆదా అవుతుందని, యూరియా ఎరువు కొరతను అధిగమించవచ్చని తెలిపారు. పోలాకి మండలంలోని కత్తెరవానిపేటలో వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి, ఏడీ వెంకటమధు, ఏవో చిరంజీవి ఇఫ్‌కో కంపెనీ ద్వారా మొక్కజొన్న పంటల తెగుళ్ల నివారణకు నానో యూరియాప్లెస్ మందును డ్రోన్‌ద్వారా పిచికారీ చేయించారు.ఈ మేరకు డ్రోన్ యంత్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే పోలాకి తహసీల్దార్ కార్యాలయ శాశ్వత భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి తొంబై ఐదులక్షలు మంజూరుచేసిందని చెప్పారు.

# వలల ప్రభావంతో వందల సంఖ్యలో తాబేళ్లు మృత్యువాత



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** తీర ప్రాంతంలో తరచూ తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల రణస్థలం మండలం దోనిపేట తీరంలో అధికంగా సముద్ర తాబేళ్ల కళేబరాలు బయటపడ్డాయి. వజ్రపుకొత్తూరు తీరప్రాంతంలోనూ కొన్నిరోజుల కిందట సముద్రం ఒడ్డుకు తాబేళ్ల కళేబరాలు కొట్టుకువచ్చాయి. వాస్తవానికి ఈ కాలంలో తీరంలో తాబేళ్లు మృతి చెందడం సర్వసాధారణం. కానీ ఈ ఏడాది మాత్రం అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా సముద్ర జలాల అడుగున తాబేళ్లు ఉంటాయి. కానీ ప్రతి 40 నిమిషాలకు ఒకసారి శ్వాస తీసుకునేందుకు ఉపరితలంపైకి వస్తాయి. అటువంటి సమయంలోనే వలలు, బోట్లు తగిలి.. విలవిల్లాడి మృత్యువాత పడుతున్నట్టు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా చేపలవేట తాబేళ్ల పాలిట శాపంగా మారుతోంది. జిల్లాలో రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ 193 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం విస్తరించి ఉంది. రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, గార, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో తీర ప్రాంతం ఉంది. విశాలమైన ప్రదేశం, ఎత్తయిన ఇసుక తెన్నెలు ఉంటాయి. ఒడిశా తరువాత తాబేళ్ల సంతతికి మన తీరం అనువైన ప్రాంతం. అందుకే తీరంలోని చాలా ప్రాంతాలకు సముద్ర జలాల అడుగు భాగంలో ఉండే తాబేళ్లు వస్తుంటాయి. ఏటా నవంబరు నుంచి మార్చి వరకూ రాత్రివేళల్లో తీరం వైపు వస్తుంటాయి. తీరానికి సుమారు 50 మీటర్ల దూరంలో ఉన్న ఇసుక దిబ్బల్లో బొరియలు చేసి గుడ్లు పెడుతుంటాయి. తాబేళ్లతో మత్స్యసంపదకు చాలా మేలు జరుగుతుంది. సముద్రంలో ఆక్సిజన్ పెంచడంతో పాటు మత్స్య సంపదను వృద్ధిచేయడంలో తాబేళ్లు కీలక పాత్ర పోషిస్తాయి. చేప గుడ్లు తినే జెల్లి ఫిష్ జాతిని నియంత్రిస్తాయి. చేపల ఉత్పత్తి పెంచేందుకు దోహదపడతాయి. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సముద్రంపై ఆధారపడిన లక్షలాది మంది జీవనోపాధికి మేలు చేస్తాయి. కానీ మన జిల్లాలో తాబేళ్లకు ప్రాణహాని కలుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. స్థానిక మత్స్యకారులు ఏటా వందలాది తాబేళ్ల కళేబరాలను కప్పిపెడుతుండడం విచారకరం. తీరానికి సమీపం నుంచే చేపలు వేటాడే మెక్‌నైజ్డ్ బోట్లు, నిషేధిత వలలు తాబేళ్ల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. పెద్ద ఇంజన్ బోట్లతో తీరానికి 8 కిలోమీటర్ల తరువాతే వేట సాగించాలన్న నిబంధన ఉంది. కానీ చాలామంది ఈ నిబంధనను పాటించడం లేదని ఆరోపణలున్నాయి. దీంతో ఉపరితలానికి వస్తున్న తాబేళ్లకు ఇంజన్ తగిలి మృత్యువాత చెందుతున్నాయి. నదులు, ఏరుల నుంచి సముద్రంలో కలుస్తున్న నీరు కూడా కలుషితం అవుతోంది. దీనివల్ల కూడా పెద్ద ఎత్తున తాబేళ్లు మరణిస్తున్నాయి. సముద్రంలో చేపలవేట సమయంలో కోనాగిల్ నెట్, అటక, టేకు వలలను మత్స్యకారులు ఉపయోగిస్తుండడంతో వాటిని తట్టుకోలేని తాబేళ్లు మృతి చెందుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. తాబేళ్లకు హాని కలుగకుండా మత్స్యకారులు వలలు వాడుకోవాల్సిన అవసరం ఉంది. చెన్నైకి చెందిన ట్రీ సంస్థ హెచ్చరికలతో.. తీరంలో తాబేళ్ల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కఠినచట్టాలను అమలు చేస్తోంది. తాబేళ్లు సైతం వన్యప్రాణుల కిందకు వస్తాయి. భారత వన్యప్రాణి సంరక్షణ చట్టం -1972 ప్రకారం తాబేళ్లను చంపడం నేరం. వాటి గుడ్లను సైతం తినడం, నాశనం చేయడం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. అందుకే ఈ చట్టాన్ని అనుసరించి తీరంలో తాబేళ్ల సంరక్షణపై ప్రభుత్వం మరింత దృష్టి సారించనుంది.

# సమగ్ర పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో టూరిజం అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో తన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అనేక అవకాశాలున్నాయని, వాటిని గుర్తించి అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. వివిధ కేంద్ర పథకాల్లో భాగంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల్లో హోం స్టేల ఏర్పాటుకు జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, లంబసింగి, మారేడుమిల్లి ప్రాంతాల్లో హోం స్టేల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. వాటిని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేలో భాగంగా పర్యాటకులకు సదుపాయాలతోపాటు చుట్టుపక్కల ప్రదేశాలు, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను పరిచయం చేయాలన్నారు. హోం స్టే నిర్వాహకులైన గిరిజన యువతకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని, వారికి మరింత ఉపాధి, ఆదాయం లభించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. స్వర్ణ గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను అసిస్టెంట్ టూరిజం డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా నియమించి, పర్యాటక ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని కలెక్టర్ సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఎక్కువగా హోం స్టేలను ఏర్పాటు చేయడం ద్వారా మహిళా సాధికారతకు దోహదపడుతుందని ఆయన తెలిపారు. ఈ నెల 20వ తేదీ నాటికి 41 చోట్ల హోం స్టేలు పర్యాటకులకు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ వినియోగం జరగకూడదని, సంపూర్ణంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఆయన చెప్పారు. అరకులోయ, మారేడుమిల్లి ప్రాంతాల్లో సమగ్ర పర్యాటక సమాచారం సెంటర్లను ఏర్పాటు చేసి వాటిలో జిల్లాలోని పర్యాటకానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచాలన్నారు. పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులు అనుసరించాల్సిన నిబంధనలు, జాగ్రత్తలు సూచించే బోర్డులు ఏర్పాటు చే యాలన్నారు. అల్లూరి జిల్లాలో వంజంగి, జోలాపుట్, పోలవరం జిల్లాలో భూపతిపాలెం రిజర్వాయర్ల ప్రాంతాల్లో వాటర్ స్పోర్ట్స్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, అందుకు అవసరమైన అనుమతులు జారీ చేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ శ్రీపూజను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి టూరిజం ప్రాజెక్టులో స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు, ఆదాయం మార్గాలుండాలన్నారు.

# సిట్ రిపోర్ట్‌లో జంతువుల కొవ్వు ఉందని స్పష్టంగా ఉంది: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ విషయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సున్నిత అంశాలపై చాలా ఆలోచించి మాట్లాడాలని తెలిపారు. చీణణదీ నివేదికను సీఎం చంద్రబాబు తమకు చదివి వినిపించారని ప్రస్తావించారు. జంతువుల కొవ్వు కలిసిందని చెప్పడం చాలా సున్నిత అంశమని పేర్కొన్నారు. మాట్లాడేటప్పుడు పర్యవసానాలు ఆలోచించే ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నివాసంలో భేటీ అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తామే అధికారంలో ఉంటామని.. రాజకీయ లబ్ధి కోసం మాట్లాడాల్సిన అవసరం ఏముందని పవన్ ప్రశ్నించారు. భగవంతుడిపైనా వైసీపీ పగబట్టిందని ధ్వజమెత్తారు. అందరం ఏడు కొండలు అంటామని.. వైసీపీ వాళ్లు రెండు కొండలు అంటారని అన్నారు. వైసీపీ హయాంలో హిందూ మతంపై చాలా దాడులు జరిగాయని ఆరోపణలు చేశారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి విగ్రహం ధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగితే.. ఇవి పోతే ఇంకొకటి కొందామన్నారని చెప్పుకొచ్చారు. అంతర్వేదిలో రథం కాలిపోతే ఎవరో పిచ్చివారు చేశారని చెప్పారన్నారు. నెయ్యి కల్తీ అంశంలో మతాల ప్రస్తావన లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'తప్పు చేసి క్షమాపణ అడగకుండా మమ్మల్నే క్షమాపణ అడుగుతున్నారు. శ్రీవారి విషయంలో తప్పుచేసిన వారు నాశనమైపోతారు. సిట్ రిపోర్ట్ ఎక్కడా వైసీపీకి క్లీన్‌చిట్ ఇవ్వలేదు. రిపోర్ట్‌లో జంతువుల కొవ్వు ఉందని స్పష్టంగా ఉంది.

భగవంతుడితో పెట్టుకున్నవారు సర్వనాశనం అయిపోతారు తప్ప బతికున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా చేసిన మహాపాపానికి దేవుడిని క్షమాపణ కోరుకోవాలి. భగవంతుడికి మోకరిల్లే వరకూ విషయాన్ని వదిలిపెట్టం. హిందూ ధర్మాన్ని కాపాడే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నాం. కల్తీ లడ్డూ వ్యవహారం ముమ్మాటికీ తెలిసి చేసిన నేరం. 2022లోనే కల్తీ నిర్ధారణ అయ్యింది. అయినా అయోధ్యకు అవే కల్తీ లడ్డూలు పంపి మహాపాపానికి ఒడిగట్టారు' అని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. కల్తీ లడ్డూ వ్యవహారంలో కళ్ల ముందు ఎన్నో వాస్తవాలు కనిపిస్తుంటే మాట్లాడకపోవటం సబబు కాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'అన్ని నివేదికలు.. ప్రసాదంలో వాడిన పదార్థాల్లో నెయ్యి లేదని నిర్ధారించాయన్నారు.

# ఉపాధి బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో ప్రగతిలో ఉన్న ఉపాధి హామీ పనులను యుద్ధప్రాతి పదికన పూర్తిచేసి, బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. నగరంలోని ఓ కల్యాణమండపంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఉపాధి హామీ పనులు, నిధుల వ్యయంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 912 పంచాయతీల్లో 2017 నుంచి ఇప్పటివరకు సుమారు 13,839 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వాటిని తక్షణమే పూర్తిచేయాలన్నారు. 2025- 26 సంవత్సరానికి సంబం ధించి సుమారు రూ.214కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. మార్చి 15నాటికి బిల్లుల ప్రక్రియను పూర్తిచేసి, పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. డ్వామా పీడీ లవరాజు మాట్లాడుతూ ఇప్పటికే రూ.111.72కోట్ల బిల్లులను అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్లు, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

# 18 నుంచి 20 వరకు బీమా సంకల్ప్ డ్రైవ్




**బొబ్బిలి, పతాకం న్యూస్:** బీమా సంకల్ప్ మెగా డ్రైవ్‌ను ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించి రూ.2.5 కోట్ల లక్ష్యాన్ని సాధించాలని సంకల్పించినట్టు పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబూరావు అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో తపాలా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోస్టల్ డివిజన్ పరిధిలో బీమా సంకల్ప్ 3.0 ద్వారా పీఎల్ఐ/ఆర్‌పీఐ ప్రీమియం సేకరణ లక్ష్యాలను ప్రతీ ఒక్కరూ సాధించాలన్నారు. పోస్టల్ సేవింగ్స్ బ్యాంకు లక్ష్యాలను మార్చి నెలాఖరు నాటికి నూరు శాతం సాధించా లన్నారు. అన్ని పోస్టాఫీస్‌ల్లో ఆన్‌లైన్ సేవలను ఎంతో నాణ్యతతో అందిస్తు న్నామన్నారు. త్వరితగతిన పార్శిల్ సర్వీసు, పోస్టల్ సేవలను అందించడంలో ముందున్నామన్నారు. సమావేశంలో బొబ్బిలి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రదీప్, పార్వతీశం, పార్వతీ పురం, బొబ్బిలి సబ్‌డివిజన్ పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు ఆటోలు ఢీ..10 మందికి గాయాలు



**సంతకవిటి, పతాకం న్యూస్:** బొద్దూరు గ్రామ సమీపంలో సా యంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పదిమంది గాయ పడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పాల ఆటో, ప్రయాణికుల ఆటో పరస్పరం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో చీపురుపల్లి మండలం జి.అగ్రహారం గ్రామానికి చెందిన చందక దుర్గమ్మ, పాటివాడ సురేష్, సి.పుష్ప తీవ్రంగా గాయపడ్డారు. మరో ఏడుగురు గాయాల పాలయ్యారు. అంబఖండిలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఉండగా... బొద్దూరు సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. రాజాం, రేగిడి 108 వాహనాలు అక్కడికి చేరుకొని ఈఎమ్‌టీలు ఏ .శ్రీనివాసరావు, ఎం.ఈశ్వరరావులు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# పేదలకు అండగా సీఎం సహాయనిధి



**రణస్థలం, పతాకం న్యూస్:** పేదలకు అండగా సీఎం సహాయనిధి ని లుస్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరా వు అన్నారు. తన క్యాంప్ కార్యా లయంలో ఇబ్రహీం బాద్, కుప్పిలి, ఫరీద్ పేట తదితర గ్రామా లకు చెందిన 20 మంది లబ్ధిదారులకు రూ.20.75లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 19 నెలల్లో ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో 132 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ 1.66 కోట్లు అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫరీద్‌పేట సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, కూటమి నేతలు పైడి ముఖలింగం, కొత్తకోట అమ్మినాయుడు, లంక శ్యామలరావు, ముప్పిడి సరేష్, కొమరాపు రవి, పిన్నింటి భానోజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవం




**పాడేరు, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీని స్థానిక గిరిజన ఉద్యోగుల భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మోరి మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా సాగెని వెంకటరమణ, కోశాధికారిగా చప్పలి యువరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.సింహాచలం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.రాంబాబు, ఉపాధ్యక్షుడిగా పి.లింగన్న, కార్యదర్శిగా పి.సింహాచలం, సంయుక్త కార్యదర్శిగా ఒ.వాసుదేవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.రాజుబాబు, కార్యవర్గసభ్యులుగా బి.భాస్కరరావు, పి.ఆనంద్, ఎస్.హరిబాబు, జి.శ్యామ్‌సుందర్, డి.సింహాచలం, ఎస్.హరిబాబు, కె.ఆనందబాబు, కె.రామ్‌లు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా కొండపల్లి రాంబాబు, సలహాదారులుగా మాసాడ ఈశ్వరరావు, ఎస్.కోటిబాబు, సి.సతీశ్, డి.ధనుంజయ్, ఎస్.పరమేశ్వరరావులు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ ఈ సందర్భంగా పేర్కొంది.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



**ఇచ్ఛాపురం, పతాకం న్యూస్:** ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కొళిగాంలోని శ్రీఅమ్మఘాగడశుణి దేవాలయం సీసీ రోడ్డు పనులను భూమి పూజ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ.. ఆలయ రోడ్డు నిర్మాణంలో గత వైసీపీ ప్రభు త్వం నిర్లక్ష్యం చేసిందని, దీంతో భక్తులు ఇబ్బందులు పడేవారని తెలిపారు. భక్తుల ఇబ్బందులను గుర్తించి 1300మీటర్ల రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. దీనికోసం ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ.40లక్షలు కేటాయిం చామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, నాయకులు పెదిని బాబ్జీ, మెరుగు సూర్యనారాయణ, సాడి సహదేవ్‌రెడ్డి, దక్కత ఢిల్లీరావు, గిన్ని బాలరాజు, డి.ప్రకాష్‌చంద్రనాయక్ పాల్గొన్నారు.

# లండన్, దోహాలో నారాయణ పర్యటన



**దోహా:** పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ లండన్, దోహాల్లో పర్యటించారు. అక్కడ ఒలింపిక్ పార్కు, స్పోర్ట్స్ సిటీలను పరిశీలించారు. అమరావతిలో చేపట్టబోయే పార్కులు, స్పోర్ట్స్ సిటీలపై అధ్యయనంలో భాగంగా మంత్రి నారాయణ, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, ఎజిఐసిఎల్ ఎమ్‌డి శ్రీనివాస్ తదితరులు లండన్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా దోహాలో స్పోర్ట్స్ సిటీని పరిశీలించారు. లండన్లోని క్వీన్ ఎలిజెబెత్ ఒలింపిక్ పార్కును సందర్శించారు. లండన్ స్టేడియం, ఆక్వాటిక్స్, సెంటర్‌హైడ్ పార్కు, లీవ్యాలో పార్కు నిర్మాణాలు అధ్యయనం చేశారు. ఒలింపిక్ ప్రధాన క్రీడలైన ఫుట్‌బాల్, రగ్బీ, బేస్‌బాల్ స్టేడియాలను పరిశీలించారు. దోహాలో ఖలీఫా ఇంటర్నేషనల్ స్టేడియం, ఆస్పిటర్ స్పోర్ట్స్ హాస్పిటల్, అస్పైర్ అకాడమీని అధ్యయనం చేశారు. 250 హెక్టార్లలో భారీ విస్తీర్ణంలో ఉన్న స్పోర్ట్స్ సిటీలో 2006లో ఆసియన్ గేమ్స్ నిర్వహించారని నిర్వాహకులు తెలిపారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికల గురించి దోహా అధికారులతో మంత్రి నారాయణ చర్చించారు.

# సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వండి




**జామి, పతాకం న్యూస్:** ఈనెల 23 నుంచి జరిగే జామి యల్లారమ్మ జాతరలో సామన్య భక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. జామి మండల పరిషత్ కార్యాలయంలో ఎల్లారమ్మ జాతర సమీక్షను ఈవో ప్రసాద్, సేవా కమిటీ అధ్యక్షుడు అల్లాడ పెద్ద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూర రద్దీని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ, తాగునీటి శాఖ, పోలీసు, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యుత్ శాఖ కోతలు లేకుండా చూడాలని.. తాటిపూడి జలాలు ద్వారా మూడురోజుల పాటు తాగునీరు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవదాయ శాఖ ఎటువంటి పాసులు ముద్రించవద్దని...ఈ బాధ్యత తహసీల్దార్ చూసుకుంటారని వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కృష్ణంరాజు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు వర్రి రమణ, ఎంపీడీవో నీలంనాయుడు, డీటీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



**ప్రకాశం, పతాకం న్యూస్:** శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలో శానంపూడి అడ్డరోడ్డు దాటిన తర్వాత సుమారు రెండు గంటల సమయంలో హైవే పెట్రోలింగ్ పోలీసులు గస్తీ తిరుగుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక స్పాట్లో చనిపోయి కనిపించింది. గురువారం హైవే పోలీసులు శింగరాయకొండ ఎస్‌ఐకు సమాచారం ఇవ్వగా ఎస్సై ఒంగోలు ఫారెస్ట్ బీట్ అధికారి శశిభూషణ కి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి ఎస్సై బి.మహేంద్ర ఫారెస్ట్ వారికి, పశుసంవర్ధన శాఖ అధికారికి తర్వాతి చర్యల నిమిత్తం అప్పగించారు. ఈ జింకలు దాహం వేసినప్పుడు నీళ్ల కోసం అడవుల్లో నుండి ఇలా ఒంటరిగా తిరుగుతుంటాయని, అనుకోకుండా ప్రమాదవశాత్తూ ఇలాంటి ఘటన జరిగినప్పుడు చనిపోతుంటాయని ఫారెస్ట్ అధికారులు తెలియపరిచారు. పశుసంవర్ధ శాఖ వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఫారెస్ట్ వారికి అప్పగించగా వారు చనిపోయిన జింకకు పంచనామా నిర్వహించి నిర్మానుష ప్రదేశంలో దహన సంస్కారాలు పూర్తి చేశారు.

# లొంగిపోయిన 12మంది మావోయిస్టులు



**బీజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో గురువారం 12మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిపై రూ. 46లక్షల రివార్డు ఉన్నట్లు సీనియర్ అధికారులు తెలిపారు. సౌత్ సబ్ జోనల్ బ్యూరోకి చెందిన ఎనిమిది మంది మహిళలు సహా 12మంది కేడర్ సభ్యులు ఇక్కడి సీనియర్ పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారని బీజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. వారిలో డివిజనల్ కమిటీ సభ్యుడు మరియు కటేకల్యాణ్ ఏరియా కమిటీ ఇన్‌చార్జ్ సోమదు మడ్కం (42), వివిధ యూనిట్లకు చెందిన పార్టీ సభ్యులు హుంగి కుంజమ్(19), పయకి కుంజమ్(22)లు ఒక్కొక్కరిపై రూ.8లక్షల రివార్డు ప్రకటించారని అన్నారు. మరో ముగ్గురు కేడర్లకు ఒక్కొక్కరికీ రూ.5లక్షలు, ఒక కేడర్‌కు రూ.2 లక్షలు, ఐదుగురు కేడర్లకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రివార్డు ప్రకటించారని చెప్పారు. ఎకె-47 రైఫిల్, రెండు సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్, 250 జిలెటిన్ స్టిక్స్, 400డిటోనేటర్స్, గన్ పౌడర్ నింపిన ఒక ప్లాస్టిక్ డ్రమ్, కార్డెక్స్ వైర్ బండిల్‌ను అప్పగించారని ఆ అధికారి తెలిపారు.

# గిరిజన ప్రాంతంలో పర్యాటకానికి కొత్త హంగులు



**అరకులోయ, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతంలో పర్యాటకానికి మరిన్ని హంగులు కల్పించి, రానున్న రోజుల్లో అధిక సంఖ్యలో సందర్శకులను ఆకర్షించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. ఇందులో భాగంగా పర్యాటకులకు ఆధునిక వసతులతో కూడిన కారవాన్ సదుపాయాలు, గిరిజన పల్లెల్లో బస చేసి స్థానిక చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార రుచులను సైతం చూసే అవకాశం కల్పించేందుకు హోం స్టేలను సిద్ధం చేస్తోంది. భవిష్యత్తులో అరకులోయ కేంద్రంగా హెలీ టూరిజాన్ని సైతం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతోంది. దీంతో రానున్న రోజుల్లో మన్యంలోని ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు మరిన్ని కొత్త సదుపాయాలు అందుబాటులోకి వచ్చి నూతన అనుభూతిని కలిగిస్తాయని టూరిజం అధికారులు భావిస్తున్నారు.

ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రధానమైన ఐదు పర్యాటక ప్రాంతాల్లో కారవాన్ టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపుతున్నది. ఇందులో భాగంగా అరకులోయకు సమీపంలోని అరకు పైనరీ, ముంచంగిపుట్టు మండలంలో జోలాపుట్ జలాశయం, చింతపల్లి మండలం లంబసింగి, మారేడుమిల్లి ప్రాంతాల్లో కారవాన్ టూరిజం పార్కుల అభివృద్ధికి చర్యలు ప్రారంభించింది. ఒక్కో పార్కులో మౌలిక సదుపాయాలు, వినోద కార్యక్రమాల కోసం రూ.కోటి చొప్పున మొత్తం రూ.5 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అవి ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి. అవి అందుబాటులోకి వస్తే కారవాన్‌లో సుమారుగా 15 మంది సౌకర్యవంతంగా బస చేయడంతోపాటు, సదరు పార్కులోనే రెస్టారెంట్, ఇతర సదుపాయాలు, వినోద కార్యక్రమాలుంటాయి. దీంతో వినూత్నంగా లగ్జరీ స్థాయిలో సదుపాయాలు కోరుకునే పర్యాటకులకు కారవాన్ టూరిజం పార్కులు వేదికగా మారనున్నాయని అధికారులు, పర్యాటకులు అంటున్నారు. బడ్జెట్‌లోనే గిరిజన పల్లెల్లో బస చేస్తూ వారి ఆచార వ్యవహారాలు, జీవన శైలిని స్వయంగా ఆస్వాదించాలనుకునే పర్యాటకుల కోసం హోం స్టే సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పర్యాటక ప్రాంతాలుగా గుర్తింపు పొందిన వాటికి చేరువగా ఉన్న గిరిజన పల్లెల్లోని ఇళ్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్ది వాటినే సందర్శకులకు అద్దెలకు ఇస్తారు. అలాగే వారికి అవసరమైన ఆహారాలు, స్థానికంగా లభించే చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలు సైతం సమకూర్చుతారు. దీంతో గిరిజన పల్లెల్లో గడిపి, వారి జీవన శైలిని స్వయంగా తిలకించిన అనుభూతిని పొందేందుకు హోం స్టే చక్కని అవకాశంగా ఉంటుందని పర్యాటకులు సైతం భావిస్తున్నారు. ఇప్పటికే అరకులోయకు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చొంపి అనే గిరిజన పల్లెలో నాలుగు హోం స్టేలను అందుబాటులోకి తీసుకువచ్చారు. భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల వరకు హోం స్టేలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. కాగా ఆధునిక సదుపాయాలతో ఎక్కడైనా సులభంగా వసతి సదుపాయాన్ని కల్పించేందుకు డోమ్ హౌస్‌లు అనువుగా ఉంటాయి. దీంతో జిల్లాలో ప్రధానమైన పర్యాటక ప్రదేశాల్లో వాటిని ఏర్పాటు చేయాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. దీనిపై ఇప్పటికి ఎటువంటి ప్రణాళికలు లేనప్పటికీ భవిష్యత్తులో వాటిని అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచన మాత్రం ఉంది.

# గిరిజన రైతులకు తేనెటీగల పెట్టెల పంపిణీ

**చింతపల్లి, పతాకం న్యూస్:** ఆదివాసీ రైతులు తేనె ఉత్పత్తిని కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసుకోవాలని ఖాదీ గ్రామీణ పరిశ్రమల సంస్థ(కేవీటీసీ) రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ ఎస్. గ్రీప్ సూచించారు. పెదబరడ గ్రామంలో తేనెటీగల పెంపకంలో పది రోజుల పాటు శిక్షణ పొందిన 40 మంది రైతులకు ఆయన ధ్రువపత్రాలను అందజేశారు. ఒక్కొక్క రైతుకి రూ.40 వేల విలువైన జార్ఖండ్ నుంచి దిగుమతి చేసుకున్న పది తేనెటీగలతో కూడిన పెట్టెలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆంధ్ర కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగి విభిన్న వాతావరణం కలిగిన ప్రాంతమన్నారు. ఈ ప్రాంతంలో తేనె ఉత్పత్తికి అనువైన వాతావరణ పరిస్థితులు అందుబాటులో వున్నాయని శాస్త్రవేత్తలు పరిశోధనల ద్వారా గుర్తించారన్నారు. ఇప్పటికే లంబసింగి పరిసర ప్రాంత రైతులు అరుదైన ఉద్యాన, సుగంధ ద్రవ్య, కూరగాయల పంటలను పండిస్తున్నారని తెలిపారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లోనూ లంబసింగి పరిసర ప్రాంత ఆదివాసీ రైతులను ప్రోత్సహించేందుకు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చామన్నారు. రైతులు తేనెటీగల పెట్టెలను సక్రమంగా నిర్వహించుకుంటే వారానికి రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల ఆదాయం వస్తుందన్నారు. తేనె ఉత్పత్తులు పెరిగితే అరకు కాఫీ తరహాలో లంబసింగి బ్రాండ్‌పై తేనెను మార్కెట్‌లో విక్రయించుకోవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. 40 మంది రైతులతో ప్రారంభమైన తేనె పరిశ్రమ రానున్న రోజుల్లో వందల సంఖ్యలో ఆదివాసీలు భాగస్వాములు కావాలన్నారు. గిరిజన రైతులు ఉత్పత్తి చేసిన తేనెకు మార్కెట్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. కిలో తేనె ప్రాంతీయ మార్కెట్‌లో రూ.500 ధర పలుకుతుందని చెప్పారు. రైతులకు రానున్న రోజుల్లోనూ కేవీటీసీ ద్వారా సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. అలాగే కుట్టుమిషన్లపై గిరిజన రైతులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎంఆర్ శాస్త్రవేత్త కె.శ్రీనివాసరావు, ఖాదీ గ్రామీణ పరిశ్రమల సంస్థ ఎగ్జిక్యూటివ్‌లు



డి.సుబ్రహ్మణ్యం, ఐ.సాయిరామ్ నాయక్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ గసాడి బాబూరావు, యూబీఐ బ్యాంక్ మేనేజర్ కె.గౌతమ్‌కుమార్, సర్పంచ్ సమిడి గోపాల్, కార్యదర్శి బి.లక్ష్మీకుమార్, ఐఐఎంఆర్ ఎఫ్‌పీవో రిప్రజెంటేటివ్ జి.రాజేశ్, లంబసింగి ట్రైబల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు కూడ సరోజిని, ఇందిరరాణి, శోభారాణి, పృథ్వీరాజ్, కన్నబాబు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు




**అమలాపురం, పతాకం న్యూస్:** గ్రామ పంచాయతీల్లో ఐవిఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పారిశుధ్యం మెరుగుదలకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖల ఉప కమిషనర్ వి.నాగార్జునసాగర్ గ్రామ కార్యదర్శులకు పిలు పు నిచ్చారు. ఇళ్ల, కుళాయి పన్నులు వసూళ్ల ద్వారా గ్రామ పంచా యతీల ఆర్థిక పరిపుష్టికి కీలకంగా వ్యవహరించాలని అన్నారు. గురువారం స్థానిక గోదావరి భవన్ నందు జిల్లా స్థాయి సమీక్ష సమావేశం కార్యదర్శులతో నిర్వహించి పన్నుల వసూళ్లు ప్రజా సంతప్తి స్థాయిలను పరిశుభ్రత పరంగా చేరుకునే అంశాలపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఆయన మా ట్లాడుతూ పారిశుధ్కయ చర్యల్లో భాగంగా ఐవిఆర్ఎస్ ద్వారా డోర్-టు-డోర్ గార్బేజ్ కలెక్షన్‌పై నూరు శాతం సంతప్తి స్థాయిలను సాధించా లన్నారు. డంప్ క్లియరెన్స్ చర్యలను సమాంతరంగా చేపట్టాలని అన్నారు. డ్రెయిన్ డీ-సిల్టింగ్‌పై వరద సంభవించే ఏరియా లకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గ్రామపంచాయతీల్లో డైలీ కలెక్షన్ చెత్తాచెదారాలు సేకరణ సమర్థవంతంగా చేపట్టాల న్నారు. ఐవిఆర్ ఎస్ సర్వేలు ద్వారా వస్తున్న ప్రజా సంతృప్తి స్థాయిలను మెరుగుపరచడంలో క్లాప్ మిత్రాలు, పారిశుధ్య కార్మికులు కీలకంగా వ్యవహ రించాలని అన్నారు.

ఇళ్ల పన్ను, నీటి ఛార్జీల వసూలుకు మొబైల్ యూనిట్లు, డిజిటల్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల వేగవంతంగా పరిష్కారం తోపాటుగా, రీ-ఓపెన్ నివారణకు చర్య లు తీసుకోవాలన్నారు. మోనటరింగ్ ప్రక్రియ కొరకు ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్లు, సానిటే షన్ స్టాఫ్ రూట్ రేషనలైజే షన్ వంటి అంశాల ద్వారా సంతృప్తి స్థాయిలను మెరుగుపరచాలన్నారు. గ్రామ సచివాలయాలపై పర్యవేక్షణ వ్యవస్థను, బలోపేతం చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇళ్ల, నీటి కుళాయి పన్ను వసూలు, పారిశుధ్యం వంటి అంశాలపై ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించబడుతు న్నాయన్నారు. డిపిఒ శాంత లక్ష్మి ప్రసంగిస్తూ ఐవిఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు .దీని ద్వారా పథ కాలు, పౌరసేవలపై ప్రజల అభిప్రాయాలు ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ, పారిశుధ్యంం వంటివి పై అసంతప్తి ఎక్కువగా కనిపిస్తోందనీ దీనిపై క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక చొరవ తీసు కోవాలన్నారు గ్రామ పంచాయతీల్లో వర్మీ కంపోస్ట్, డ్రైడేలు, ట్రైసైకిల్స్‌తో కలెక్షన్ విధానాలను ప్రోత్సహిం చాలన్నారు. ఐవిఆర్ఐ ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పారిశుధ్యం, పన్ను వసూలు వంటి గ్రామ పంచాయతీ సేవల్లో నిర్దిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

# కిడ్నీల ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండాలంటే..



మనం తీసుకునే ఆహారంపైనే మన శరీర ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఆరోగ్య కరమైన ఆహారాన్ని తీసుకున్నప్పుడే శరీరం లోని అవయవాలతో సహా మొత్తం శరీరానికి మేలు కలుగుతుంది. అనారోగ్యకరమైన ఆహారం శరీరంలోని అవయవాలకు హానిని కలిగిస్తుంది. మనం తీసుకునే ఆహారం మూత్రపిండాల ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేసి అందులో ఉండే విష పదార్థాలను బటయకు పంపిస్తాయి. మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటే మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బ తింటుంది. మనం తీసుకునే ఆహారాలు కొన్ని మూత్రపిండాలపై ఒత్తిడిని కలిగించడంతో పాటు మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల మూత్ర పిండాల సమస్యలు తలెత్తుతాయి. మూత్ర పిండాల ఆరోగ్యానికి హానిని కలిగించే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

జంక్‌ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. వీటిలో ఉప్పుతో పాటు ప్రిజర్వేటివ్స్ ఉంటాయి. ఇవి మూత్రపిండాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఫ్రెంచ్ ఫ్రైస్, ప్యాక్ చేసిన ఆహారాలు, పిజ్జా వంటివి మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు చెబుతున్నారు. అలాగే మాంసంలో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రోటీన్ మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచుతుంది. మాంసాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనితీరు తగ్గుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా తయారవుతుంది. ఇది మూత్రపిండాల వైఫల్యానికి దారి తీస్తుంది. కనుక మాంసాన్ని కూడా తక్కువగా తీసుకోవాలి. అదే విధంగా చక్కెర పానీయాలు, తీపి ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటుంది. తీపి పదార్థాలు రక్తంలో చక్కెరను పెంచుతాయి. రక్తంలో ఎక్కువగా ఉండే చక్కెర స్థాయిలు మూత్రపిండాలకు హానిని కలిగిస్తాయి.

వీటితో పాటు మనలో చాలా మంది సాసేజ్‌లు, బేకన్, ప్యాక్ చేసిన మాంసం, ప్రాసెస్ చేసిన, డీప్ ఫ్రై ఆహారాలను ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇవి మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు బీపీ, ఊబకాయం వంటి ఇతర అనారోగ్య సమస్యలకు కూడా కారణమవుతాయి. ఇవన్నీకూడా మూత్రపిండాల ఆరోగ్యానికి హానికరం. కనుక ఈ ఆహారాలను తీసుకోవడం చాలా వరకు తగ్గించాలని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారాలకు బదులుగా మూత్రపిండాలకు మేలు చేసే ఆహారాలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయలు వంటి వాటిని తీసుకోవాలి. సమతుల్యమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకునే ప్రయత్నం చేయాలి. రోజూ 8 నుండి 10 గ్లాసుల నీటిని తాగాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి. రక్తపోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు అదుపులో ఉండేలా జాగ్రత్త వహించాలి. దీని వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడకుండా ఉంటుంది. మూత్రపిండాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ విధంగా సరైన ఆహారం, తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, మూత్రపిండాలకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

# బ్లాక్ హెడ్స్ ఎలా తొలగించుకోవాలి?



బ్లాక్ హెడ్స్ ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెడుతుంటాయి. వీటిని పోగొట్టుకోవడం నిజంగా సులువైన పని మాత్రం కాదు. అంతేకాదు ఎంత ప్రయత్నించినా బ్లాక్ హెడ్స్ సమస్యను శాశ్వతంగా నయం చేసుకోలేరని చెబుతున్నారు నిపుణులు. కాకపోతే కొన్ని జాగ్రత్తలు, పద్ధతులతో వీటి ప్రభావాన్ని చాలా వరకు తగ్గించవచ్చట. మార్కెట్లో బ్లాక్ హెడ్స్ నయం చేసేందుకు చాలా రకాల క్రీములు దొరుకుతున్నప్పటికీ అవి మచ్చలు, ఇన్?ఫెక్షన్లు, చికాకు వంటి ఇతర సమస్యలను తెచ్చి పెడుతున్నాయి. కాబట్టి బ్లాక్ హెడ్స్ రావడానికి కారణాలు ఏంటి? ఎన్ని చోట్ల ఏర్పడతాయి? వీటిని తొలగించుకోవడం అనే విషయాలపై పూర్తి అవగాహన కోసం మీరు ఈ వార్త చదవాల్సిందే. బ్లాక్ హెడ్స్ అనగానే కేవలం కంటి కింద కలిగే నల్లటి మచ్చలు అని అంతా అనుకుంటారు. కానీ నిజానికి బ్లాక్ హెడ్స్ అంటే కేవలం కళ్ల కింద మాత్రమే కాదు. ముఖం, శరీరంలోని ఇతర భాగాల్లో చాలా చోట్ల వస్తాయట. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే ఇవి కేవలం నల్లటి రంగులో మాత్రమే ఉండవు. చర్మపు రంధ్రాలు నూనె, దుమ్ము వంటి చిన్న చిన్న మృత కణాల ద్వారా మూసికిపోయినప్పుడు ఏర్పడే మురికే ఈ బ్లాక్ హెడ్స్. వీటికి బయట గాలి తాకడం వల్ల ఆక్సీకరణం చెంది నల్లగా కనిపిస్తాయి. సాధారణంగా బ్లాక్ హెడ్స్ అనేవి శరీరంలో చమురు ఉత్పత్తి ఎక్కువగా ఉన్న చోట ఏర్పడతాయి. ఎక్కువ మందికి ఇవి ముక్కు చుట్టూ ఉండే ప్రాంతంలో, గడ్డం ఉండే చోట కనిపిస్తుంటాయి. దీంతో పాటుగా నుదురు, భూజాలు, వీపు, ఛాతి ప్రాంతాల్లో కూడా బ్లాక్ హెడ్స్ ఏర్పడతాయి. మార్కెట్లో లభించే కొన్ని క్లీన్సర్లలో లభించే సాలిసిలిక్ యాసిడ్, చర్మంలో పేరుకుపోయిన చమురు, చనిపోయిన చర్మ కణాలను విచ్ఛిన్నం చేస్తుంది. సాలిసిలిక్ యాసిడ్ వాష్?ను ముందుగా మీరు రోజుకు ఒకసారి మాత్రమే ఉపయోగించాలి.

ఇది మీ ముఖానికి పడుతుంది అనిపిస్తే, సమస్య తగ్గుతుందని నమ్మకం కలిగితే క్రమంగా దీంతో రోజుకు రెండు సార్లు మీరు ముఖం కడుక్కోవచ్చు. నిజానికి మొటిమలు, మచ్చలు వంటి సమస్యలను ఎక్స్‌ఫోలియేషన్ పెద్దగా తగ్గించలేనప్పటికీ బ్లాక్ హెడ్స్ విషయంలో మాత్రం చక్కగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆల్ఫా, బీటా హైడ్రాక్సీ యాసిడ్స్ (ఋూనూ,దీనూ%)లు కలిగిన పదార్థాలు బ్లాక్ హెడ్స్ సమస్యకు మంచి పరిష్కారంగా మారతాయి. ఇక్కడ ఓ ముఖ్య విషయం ఏంటంటే మీరు చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసేందుకు ఉపయోగించే బ్రష్?లు చాలా సున్నితంగా ఉండేలా చూసుకోండి. సున్నితమైన చర్మం కలిగిన వారు దీనికి కాస్త దూరంగా ఉండటమే మంచిది. చర్మపు రంధ్రాల్లో నుంచి దుమ్ము, ధూళి, నూనె, మృత కణాలు వంటి వాటిని తొలగించడంలో క్లే మాస్క్ చాలా బాగా పనిచేస్తుంది. ఇందులోని సల్ఫర్ చనిపోయిన మృతకణాలను తొలగించి చర్మాన్ని ఆకట్టుకునేలా తయారుచేస్తుంది.

బ్లాక్ హెడ్స్ సమస్యను తగ్గించుకోవాలంటే మేకప్ ప్రొడక్ట్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మీరు ఉపయోగించే పదార్థాల్లో కోమేడోజెనిక్స్ లేకుండా చూసుకోవాలి. అలాగే రాత్రి నిద్ర పోయేముందు కచ్చితంగా మేకప్ తీసేసి ముఖాన్ని శుభ్రంగా కడుక్కుని పడుకోవాలి.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు




**అమలాపురం, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దని సిపిఎం డిమాండ్ చేసింది. పేదల హక్కులను కాలరాసేలా కొత్తగా తీసుకొచ్చిన 'విబి జిఆర్ఎఎంజి' చట్టాన్ని తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ అమలాపురం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహిం చారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పి ంచారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రం లోని ఎన్‌డిఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం స్ఫూ ర్తికే సమాధి కడుతోందని విమర్శించారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని మార్చి, ఆ పేరును తొలగించడం మతోన్మాద చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత చట్టంలో కేంద్రం 90 శాతం నిధులు ఇచ్చేదని, కానీ కొత్త చట్టంలో కేంద్రం వాటాను 60 శాతానికి తగ్గించి, రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం వల్ల నిధుల కొరత ఏర్పడి పనులు ఆగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 125 రోజుల పని అని మాయ మాటలు చెబుతూనే, ఏడాదిలో 60 రోజుల పాటు పని ఉండదని నిబంధనలు పెట్టడం పేదలను వంచించడమేనని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులను ఏడాదికి 200 రోజులకు పెంచాలని కనీస వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న ఎంపీలందరూ ఈ ప్రజా వ్యతిరేక చట్టానికి ఆమోదం తెలపడం విచారకరమని, దీనికి నిరసనగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మె, రాస్తారోకో కార్యక్రమాల్లో గ్రామీణ పేదలు, వ్యవ సాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు జిల్లానాయకులు సఖిలే సూర్యనారాయణ, ఎం. భాస్కర రావు, బుంగ సత్యనారాయణ, కె .గోపాలన్, పాము బాలయ్య, కె. శంకర్, ఎన్. వెంకట్, కె .రాము, చింతా వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి రాని ఫిషింగ్ హార్బర్లు, కోల్డ్ స్టోరేజీలు

## దళారులకు తక్కువ ధరలకు విక్రయాలు.. నష్టపోతున్న మత్స్యకారులు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో ఫిషింగ్ హార్బర్లు, కోల్డ్‌స్టోరేజ్‌లు లేక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. తీరంలో ఆటుపోట్ల నడుమ వేట సాగించినా.. మత్స్యసంపదను భద్రపరుచుకోలేక పోతున్నారు. మంచి ధర వచ్చేదాక చూసే పరిస్థితి లేక మధ్యవర్తులు, దళారులకు తక్కువ ధరకు చేపలను విక్రయిస్తున్నారు. తమ కష్టాన్ని దళారులు దోచుకుంటున్నారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 11 తీర మండలాల్లో 104 మత్స్యకార గ్రామాలున్నాయి. 1.80 లక్షల మత్స్యకార జనాభా ఉండగా.. వేటపై ఆధారపడి 35వేల మంది బతుకుతున్నారు. 3,584 ఇంజను బోట్లు, 2,679 తెప్పలు, పడవలపై చేపల వేట సాగిస్తున్నారు. ప్రధానంగా ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, గార, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో మత్స్యకారులు వేటపై ఆధారపడుతున్నారు. అయితే ఒక్కో మెకనైజ్డ్ బోటులో వేటకు వెళ్తే.. 3 నుంచి 10 టన్నుల వరకూ చేపలు తీసుకొస్తారు. వీటిని తీరంలో నిల్వ చేసుకునేందుకు కోల్డ్‌స్టోరేజీలు లేవు. ఎండబెట్టేందుకు ప్లాట్‌ఫారంలు సైతం లేవు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దళారులకు విక్రయిస్తుంటారు. మార్కెట్‌లో తాజా చేపల ధర కిలో రూ.150 పైమాటే. కానీ దళారులు మాత్రం కిలో రూ.80 నుంచి రూ.100 లోపు కొనుగోలు చేస్తున్నారు. ప్రత్యామ్నాయం లేకపోవడంతో దళారులు అడిగినంత ధరకు మత్స్యకారులు విక్రయిస్తున్నారు.

తీరంలో ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు నిర్మిస్తే వ్యాపారులు అనుబంధంగా కోల్డ్‌స్టోరేజీలు కట్టేందుకు ముందుకు వస్తారు. ఎచ్చెర్ల మండలం బుడగట్ల పాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఇంతవరకూ కొలిక్కి రాలేదు. కనీసం అక్కడ కోల్డ్ స్టోరేజీలు నిర్మించినా మత్స్యసంపదను నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మంచి ధర పలికినప్పుడు విక్రయించుకోవచ్చు. నాబార్డు సాయంతో రెండుచోట్ల కోల్డ్‌స్టోరేజీల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. ప్రభుత్వం సైతం రెండు ఫిషింగ్ హార్బర్లు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంలో ఉంది. అవి వీలైనంత త్వరగా కార్యరూపం దాల్చితే మత్స్యకారులకు ఇబ్బందులు తీరనున్నాయి. ఈ విషయంలో మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవ చూపాలని మత్స్యకారులు కోరుతున్నారు.




# అండర్-19 వన్డే ప్రపంచకప్ ఫైనల్లోకి భారతజట్టు

## నేడు ఇంగ్లాండ్‌తో టైటిల్ పోరు



ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్ ఫైనల్లోకి భారతజట్టు దూసుకెళ్లింది. ఓపెనర్ ఆరోన్ జార్జి సెంచరీకి తోడు, సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే అర్ధసెంచరీలతో రాణించడంతో ఆఫ్ఘనిస్తాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని 41.1ఓవర్లలో భారతజట్టు కేవలం 3వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. దీంతో టీమిండియా రికార్డుస్థాయిలో 10వ సారి ఫైనల్‌కు చేరింది. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో బుధవారం జరిగిన రెండో సెమీఫైనల్‌లో భారతజట్టు 7 వికెట్ల తేడాతో ఆఫ్ఘనిస్తాన్‌పై ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆఫ్ఘన్ లక్ష్యాన్ని 41.1 ఓవర్లలోనే ఛేదించి చరిత్ర సృష్టించింది. భారత ఓపెనర్ ఆరోన్ జార్జ్ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 104 బంతులు ఎదుర్కొన్న జార్జ్ 15 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 115 పరుగులు సాధించి అజేయంగా నిలిచాడు. మరోవైపు, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆఫ్ఘన్ బౌలర్లను వణికించాడు. వైభవ్ కేవలం 33 బంతుల్లోనే 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 68 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేట్ 206.06గా నమోదవ్వడం విశేషం. జార్జ్ తన అద్భుత ప్రదర్శనకు గాను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకున్నాడు. తొలి వికెట్ పడిన తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ఆయుష్ మాత్రే సైతం రాణించాడు. ఆరోన్ జార్జ్‌తో కలిసి రెండో వికెట్‌కు 101 బంతుల్లో 114 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని జోడించాడు. ఆయుష్ 59 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 62 పరుగులు చేసి అవుటయ్యాడు. అనంతరం విహాన్ మల్హోత్రా (38 నాటౌట్), వేదాంత్ త్రివేది (5 నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు. ఈ మ్యాచ్‌లో భారత్ సాధించిన విజయం అండర్-19 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత భారీ ఛేజింగ్‌గా రికార్డు పుటల్లోకెక్కింది. 311 పరుగుల లక్ష్యాన్ని భారతజట్టు కేవలం 41.1ఓవర్లలో సునాయాసంగా ఛేదించింది. గతంలో 2000, 2008, 2012, 2018, 2022 ఛాంపియన్‌గా నిలిచిన భారతజట్టు 2006, 2016, 2020, 2024లలో రన్నరప్‌గా నిలిచింది. ఇప్పుడు 10వ సారి ఫైనల్‌కు చేరి 6వ టైటిల్‌పై కన్నేసింది. సెమీఫైనల్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై ఘన విజయం సాధించిన భారత్, మరోసారి టైటిల్ పోరుకు సిద్ధమైంది. శుక్రవారం జరగనున్న ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో భారత్, ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి. ఆఫ్ఘనిస్తాన్ జట్టు సెమీఫైనల్ చేరడం వారి చరిత్రలో ఇదే మొదటిసారి. ఇంగ్లాండ్‌తో జరిగే ఫైనల్‌లో కూడా ఇదే తరహా ప్రదర్శన కనబరిస్తే టీమిండియా ఆరోసారి విశ్వవిజేతగా నిలవడం ఖాయం.

ఇండియా (అండర్-19) ఇన్నింగ్స్: ఆరోన్ జార్జి (సి)నజీఫుల్లా (బి)వాహిదుల్లా 115, సూర్యవంశీ (సి)ఉస్మాన్ (బి)ఒమర్జారు 68, ఆయుష్ మాత్రే (సి)ఉస్మాన్ (బి)ఒమర్జారు 62, విహాన్ మల్హోత్రా (నాటౌట్) 38, త్రివేది (నాటౌట్) 5, అదనం 23. (41.1 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 311 పరుగులు.

# టీ20 ప్రపంచ కప్‌లో టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్?




నవీ ముంబయి వేదికగా భారత్, దక్షిణాఫ్రికా మధ్య టీ20 వరల్డ్‌కప్ వార్మప్ మ్యాచ్ జరిగింది. ఇందులో అభిషేక్ శర్మకు తోడుగా ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. దీంతో ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఓపెనర్‌గా వచ్చిన సంజూ శాంసన్ వార్మప్ మ్యాచులో ఆడలేదు. అతడి స్థానంలో ఇషాన్ దిగాడు. ఓపెనర్‌గా వచ్చిన కిషన్ కేవలం 20 బంతుల్లోనే రెండు ఫోర్లు, ఏడు సిక్స్‌లతో 53 పరుగులు సాధించాడు. ఈ తుఫాన్ ఇన్నింగ్స్‌తో టీమిండియా ఓపెనర్‌గా తన బెర్తు సుస్థిరం చేసుకున్నాడు. న్యూజిలాండ్ టీ20 సిరీస్‌లో సరిగ్గా ఆడని సంజూ.. పొట్టి ప్రపంచకప్‌లో ఆడే భారత తుది జట్టులో స్థానం దక్కించుకోవడంలో విఫలమయ్యాడు. ఇషాన్ కిషన్ కొంతకాలంగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. అయితే.. టీ20 ప్రపంచకప్ విషయంలో సెలెక్టర్ల దృష్టిలోనే లేడు. అంతకముందు.. ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో జార్ఖండ్ తరపున అదిరిపోయే ప్రదర్శన చేయడమే ఇందుకు కారణం. న్యూజిలాండ్ సిరీస్‌కు అనూహ్యంగా జట్టులోకి వచ్చిన కిషన్.. ఓపెనర్‌గా సంజూ విఫలమవుతుంటే.. వన్‌డౌన్‌లో వస్తూ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 215 పరుగులతో సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అదే సమయంలో సంజూ శాంసన్ అయిదు టీ20ల్లో కలిపి కేవలం 46 పరుగులు మాత్రమే చేసి ఘోరంగా విఫలమయ్యాడు.

ఈ క్రమంలో తాజాగా ప్రకటించిన ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇషాన్ ఏకంగా 32 స్థానాలు ఎగబాకి, 32వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. దీంతో ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్‌లో సంజూ శాంసన్ బెంచ్‌కే పరిమితమై, ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడనే సంకేతాలు ఈ వార్మప్ మ్యాచ్‌తో వచ్చాయని క్రీడా నిపుణులు అభిప్రాయా పడుతున్నారు.




# ఏప్రిల్ 30న థియేటర్స్‌లోకిరానున్న 'పెద్ది' సినిమా



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర దర్శకుడు బుచ్చి బాబు సానా అధికారికంగా ప్రకటించారు.

వాస్తవానికి ఈ చిత్రాన్నిమార్చి 27న విడుదల చేయాలని భావించారు. పవన్ కల్యాణ్ కొత్త చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26న వస్తున్నట్టు ఇవాళ ప్రకటించిన నేపథ్యంలో, 'పెద్ది' విడుదల తేదీని వెనక్కి జరిపినట్టు తెలుస్తోంది.

అయితే, కొత్త విడుదల తేదీ మే డే వీకెండ్‌తో కలిసి వస్తుండటంతో సమ్మర్ సీజన్‌లో సినిమాకు ఇది బాగా కలిసొస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. "అతడి రాక తేదీ మారుతుంది, కానీ అతడి దృఢ సంకల్పం మారదు" అంటూ చిత్రబృందం చేసిన ప్రకటన అభిమానుల్లో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.

గ్రామీణ క్రీడా నేపథ్యంతో కూడిన యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ టైటిల్ రోల్‌లో కనిపించనున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.


# సరికొత్త లుక్‌లో మహేష్‌బాబు



కథానాయకుడు మహేష్‌బాబు సరికొత్త లుక్‌లో కన్పించబోతున్నారు. రాజమౌళి దర్శకత్వంలో వస్తున్న సినిమా 'వారణాసి' సినిమా ఇప్పటికే షూటింగ్ ప్రారంభించి రెండేళ్లయ్యింది. గతేడాది నవంబరులో టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోపాటు మూవీ ఎలా ఉండబోతుందనేది మూడు నిమిషాల వీడియోతో రివీల్ చేశారు. ప్రస్తుతం, గతం, భవిష్యత్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఇందులో మహేష్‌బాబు శ్రీ రాముడి పాత్రలోనూ కాసేపు కనిపించనున్నాడు. 'ఈ సినిమా కోసమే నా రన్నింగ్ స్టైల్‌ని కూడా మార్చుకున్నా. రాముడి పాత్ర ఆహార్యం కోసం దాదాపు ఏడాదిపాటు చిత్ర యూనిట్ ప్రిపరేషన్ చేయించింది. రెండు నుంచి మూడు నెలలపాటు కలరీ యుద్ధవిద్య కూడా నేర్చుకున్నాను. రాజమౌళి.. నా రన్నింగ్ టెక్నిక్ మార్చాలని అన్నాడు. దీనికోసం ఏకంగా 6 నెలలపాటు ట్రైనింగ్ తీసుకున్నాం. కాకపోతే 2 సీన్లు మాత్రమే తీశారు. అలాంటి నిబద్ధత 'వారణాసి' కోసం నేను చూపించాను' అని మహేష్‌బాబు అని వెల్లడించారు. వారణాసి సినిమాలో మహేష్‌బాబుకు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.




# ఇళయరాజా పట్టువదలని వ్యక్తి: తమన్



దక్షిణ భారత అగ్రశ్రేణి సంగీత దర్శకుల్లో ఒకరైన ఎస్.ఎస్. తమన్, భారత సంగీత దిగ్గజం 'ఇసైజ్ఞాని' ఇళయరాజాపై ప్రశంసల వర్షం కురిపించారు. 77 ఏళ్ల వయసులో సొంతంగా రికార్డింగ్ స్టూడియోను ఏర్పాటు చేసిన ఇళయరాజాను చూసి స్ఫూర్తి పొందానని తెలిపారు. ఆయనను "నిజమైన సంగీత దిగ్గజం" అని, "ఎన్నడూ పట్టువదలని మనిషి" అని అభివర్ణించారు. ఇటీవల ఇళయరాజా తన కొత్త మ్యూజిక్ స్టూడియో ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. "ఫిబ్రవరి 3 నాటికి ఈ కొత్త స్టూడియోలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయ్యాయి. నా రెండో సింఫనీ రచన కూడా దాదాపు పూర్తయింది" అని ఆయన పేర్కొన్నారు. ఈ పోస్ట్‌ను ఉటంకిస్తూ తమన్ స్పందించారు. "77 ఏళ్ల వయసులో సొంత రికార్డింగ్ స్టూడియో కట్టారు. ఆయనే నిజమైన లెజెండ్. పట్టువదలని మనిషి. కుర్రాళ్లూ.. మనం ఇప్పుడే మొదలుపెట్టాం. ఒకటే జీవితం, బతుకుదాం. మాస్టర్ ఇళయరాజా గారి నుంచి నేర్చుకుందాం" అని రాసుకొచ్చారు. గతేడాది మార్చి 8న లండన్‌లోని ఈవెంటిమ్ అపోలో థియేటర్‌లో ఇళయరాజా తన మొదటి పాశ్చాత్య క్లాసికల్ సింఫనీ 'వ్యాలియంట్'ను ప్రదర్శించి చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ప్రపంచ ప్రఖ్యాత రాయల్ ఫిల్హార్మోనిక్ కాన్సర్ట్ ఆర్కెస్ట్రాతో కలిసి ఆయన ఈ ప్రదర్శన ఇచ్చారు. గతేడాది అక్టోబర్‌లో తన తల్లి వర్ధంతి తర్వాత రెండో సింఫనీ రాయడం ప్రారంభిస్తానని ఇళయరాజా ప్రకటించారు. దీంతో పాటు 'సింఫోనిక్ డ్యాన్సర్స్' అనే మరో కొత్త సంగీత రచనను కూడా చేయనున్నట్లు తెలిపారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**